'అక్షరమే అండగా.. సమస్యల పరిష్కారమే అజెండాగా' లక్ష్యమిదే

జీవకోన సభలో ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య



'అక్షరమే అండగా..' సభలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, వేదికపై ఎమ్మెల్యే ఆరణి, కమిషనరు మౌర్య

ఇకపై నిరంతరం ప్రజలకోసం

'ఆంధ్రజ్యోతి' వేసిన పునాదిని కొనసాగిస్తాం

ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఆంధ్రజ్యోతి వేసిన పునాదిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. ఆంధ్రజ్యోతి చేపట్టిన అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమంలో ప్రజలు చెప్పిన సమస్యల్లో చాలావాటిని వంద రోజుల్లో పరిష్కరించాం. మిగిలిన వాటినీ పరిష్కరిస్తాం. కుక్కల బెడద ఎక్కువగా ఉందని కూడా స్థానికులు చెప్పారు. వాటికి వ్యాక్సిన్ వేయించి కట్టడి చేసేలా ఇప్పటికే చర్యలు చేపడుతున్నాం. లెప్రసీ కాలనీకి పేరు మార్చాలని కార్పొరేటర్‌తో పాటు కాలనీవాసులు కోరారు. ఆ విషయాన్ని కౌన్సిల్ మీటింగ్‌లో ప్రతిపాదించి జ్యోతి లెప్రసీ కాలనీకి జ్యోతి కాలనీగా పేరు మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

- ఎన్.మౌర్య, కార్పొరేషన్ కమిషనర్



'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' వంద రోజుల కిందట జీవకోనలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన సదస్సులో ప్రజలు పలు సమస్యలను ప్రస్తావించారు. ఇప్పటికే మున్సిపాలిటీ, తుడా నిధులతో సీసీ రోడ్లు, తాగునీటి సమస్యను పరిష్కరించాం. గంజాయి బ్యాచ్, ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశాం. శ్మశాన వాటికకు ప్రహరీ, గేట్ల ఏర్పాటుకు రూ.10 లక్షలు మంజూరు చేశాం. శాశ్వత ఇంటి పట్టాల విషయమై రెవెన్యూ, ఫారెస్టు, టీటీడీ అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతాం. నా విజయానికి పునాది వేసిన జీవకోన అభివృద్ధికి తప్పక కృషి చేస్తా. సమస్యలను మా దృష్టికి తీసుకొచ్చి.. పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే



తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటికే పత్రికాపరంగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎంతగానో కృషి చేస్తున్నాం. అదే తరహాలో మరో అడుగు ముందుకు వేసి 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి పునాది వేశాం. ప్రజల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. అందులో భాగంగా వంద రోజుల కిందట ఇదే జీవకోనలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు వివరించిన అనేక సమస్యల్లో సగానికిపైగా పరిష్కారం లభించింది. మిగిలిన వాటినీ పూర్తిగా పరిష్కరించేందుకు మా వంతు కృషి చేస్తాం' అని 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య అన్నారు. తిరుపతి నగరం జీవకోనలోని శ్రీలలితా త్రిపుర సుందరి ఆలయంలోని ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన 'అక్షరమే అండగా సభలు' కార్యక్రమంలో అధికార ప్రముఖుల ప్రసంగాలు, ప్రజల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేమూరి ఆదిత్య మాట్లాడుతూ.. ఇప్పటికే రూ.65 లక్షలతో అనేక సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు శాంతి భద్రతల రక్షణ కోసం పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో ఇది మొదటి అడుగేనని, ఇదే తరహాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఇందుకు సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, జీవకోన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వర రావు, బ్రాంచ్ మేనేజర్ వి.సురేష్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి వి.సుధాకరబాబు, ఏడీవీటీ మేనేజరు ఈశ్వర నాయుడు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి మోహన్‌రావు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి ఉమాపతి, బ్యూరో ఇన్‌చార్జి శివ ప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.నరేంద్ర, ఏబీఎన్ స్టాఫర్ దినేష్, నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యామ్ సుందర్, ఎంఈ గౌతమి, డీఈ రమణ, హెల్త్ ఆఫీసర్ యువఅన్వేష్, జనసేన నాయకులు నరసింహులు నాయుడు, రాజా రెడ్డి, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

గోవిందనగర్‌లో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి





ఎర్రమిట్ట ఈస్ట్ మొదటి వీధిలోని సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఆంధ్రజ్యోతి డైరెక్టర్ ఆదిత్య

భూమిపూజ.. ప్రారంభోత్సవాలు

జీవకోనకు చేరుకున్న వేమూరి ఆదిత్యకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. కమిషనర్ మౌర్య, కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్యతో కలిసి సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే సొంత నిధులతో ప్రారంభమైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించారు. జీవకోన పరిధిలో రూ.37.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును సభా కార్యక్రమం అనంతరం ప్రారంభించారు.



అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి


ఎమ్మెల్యే మాటతో ఎస్పీ చొరవ

జీవకోనలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటుచేస్తామన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇచ్చిన హామీతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చొరవతో అవుట్ పోస్ట్ ఏర్పాటుచేశారు. దీని ప్రారంభోత్సవంలో అతిథులతో పాటు అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ శ్రీలత, సీఐ రామకిషోర్, ఎస్ఐలు నాగార్జున రెడ్డి, లోకేశ్‌బాబు పాల్గొన్నారు.

చిత్తూరు చిన్నబోతోంది!

- **నగరి నియోజకవర్గంలోని మూడు మండలాలు కూడా తిరుపతి జిల్లాలోకి?**
- **భవిష్యత్తులో మిగిలేది 22 మండలాలే**

చిత్తూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనతో విద్య, వైద్య, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలను కోల్పోయి చిత్తూరు అనాథగా మిగిలింది. ఇప్పుడు ప్రజల అభ్యర్థనలు, పరిపాలనా సౌలభ్యం పేర్లతో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చిత్తూరు మరింత చిన్నబోయేలా ఉంది.ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రివర్గ సబ్ కమిటీని నియమించారు. అప్పుడే పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను మదనపల్లె రెవెన్యూ సబ్ డివిజన్‌లోకి మార్చేందుకు రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వాలని క్యాబినెట్ తీర్మానించింది. ఇందుకు అనుగుణంగా ఆయా మండలాలను మారుస్తున్నట్లు ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వాలని గురువారం చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.దీనిపై విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. పుంగనూరులోని ఆరు మండలాలు అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో కలిపేస్తే ఇక చిత్తూరులో 25 మండలాలే ఉంటాయి.అలాగే జిల్లాల విభజన సమయంలో నగరి నియోజకవర్గంలోని రెండు మండలాలు తిరుపతిలో, మూడు చిత్తూరులో కలిపారు. కానీ ఎన్నికల సమయంలో చిత్తూరులో ఉన్న నగరి, నిండ్ర, విజయపురం మండలాలను కూడా తిరుపతి జిల్లాలోనే కలిపేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా గురువారం చిత్తూరులో జరిగిన జిల్లా స్థాయి మహానాడులో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ.. 'త్వరలో ఆ మూడు మండలాలను తిరుపతిలో కలిపేస్తున్నాం' అని చెప్పారు.జిల్లాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే చెప్పిన మాటలు అమలయ్యే సూచనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. నగరిలోని ఆ మూడు మండలాలు తిరుపతిలో కలిసిపోతే, ఇక చిత్తూరు జిల్లాకు 22 మండలాలే మిగులుతాయి.



రెవిన్యూలో బదిలీలకు శ్రీకారం

అన్ని క్యాడర్లలోనూ స్థానచలనం - నోడల్ అధికారిగా కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): రెవిన్యూశాఖలో బదిలీలకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీఅయ్యాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయిలో జరుగనున్న ఈ బదిలీలకు కలెక్టర్ సుమిత్ కుమార్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. తిరుపతి జిల్లా కలెక్టరు సభ్యుడిగా, చిత్తూరు డీఆర్వో మోహన్‌కుమార్ కన్వీనర్‌గా బదిలీల కమిటీకి నాయకత్వం వహిస్తారు.తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐలు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, వీఆర్వో గ్రేడ్-1, గ్రేడ్-2లకు బదిలీలుంటాయి. ఉమ్మడి జిల్లాస్థాయిలో జరిగే వాటిని కలెక్టరేట్లకు మాత్రమే బదలాయిస్తారు.బదిలీ ప్రాంతంలో కలెక్టరేట్‌కు రిపోర్టు చేసుకున్న తర్వాత అక్కడి కలెక్టర్ మండలాల్లో పోస్టింగ్ ఇస్తారు. ప్రస్తుతం తిరుపతితో పోలిస్తే చిత్తూరు జిల్లాలోనే ఎక్కువగా తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

చిత్తూరు జిల్లా స్థాయిలో చైర్మన్‌గా కలెక్టర్

చిత్తూరు జిల్లాస్థాయిలో బదిలీల కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ సుమిత్‌కుమార్, సభ్యురాలిగా జేసీ విద్యాధరి, కన్వీనర్‌గా డీఆర్వో మోహన్ కుమార్ వ్యవహరిస్తారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలోనే తహసీల్దార్లు, వీఆర్వో గ్రేడ్-1, గ్రేడ్-2 అధికారులు, ఉద్యోగులకు పోస్టింగ్స్ ఇస్తారు.కొన్ని క్యాడర్లకు జేసీ విద్యాధరి చైర్మన్‌గా, డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులకు పోస్టింగ్ ఇస్తారు.ఈనెల 28వ తేదీ లోగా ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి జూన్ 2వ తేదీ లోపు బదిలీల ప్రక్రియను పూర్తిచేయాల్సివుంది.

2వ తేదీలోగా బదిలీల ప్రక్రియ పూర్తి

బదిలీలకు సంబంధించి ఉద్యోగులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఉద్యోగి హోదా, పనిచేస్తున్న జిల్లా, ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు, ఎక్కడికి బదిలీ కోరుకుంటున్నారు,ఐదేళ్ళలోపు సర్వీసు ఉన్నవారు బదిలీ కోరుకుంటే కారణాలు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన కేసులను పేర్కొంటూ జాబితా తయారుచేయాలి. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి జూన్‌నెల 2వ తేదీలోగా బదిలీల ప్రక్రియను పూర్తిచేస్తాం. తాజా మార్గదర్శకాలతో కలెక్టరేట్‌లో బదిలీల కసరత్తు ప్రారంభించాం.

- మోహన్‌కుమార్, చిత్తూరు డీఆర్వో

యోగాపై 26నుంచి అవగాహన కార్యక్రమాలు

చిత్తూరు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): యోగాపై ఈనెల 26 నుంచి జూన్ 21వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో యోగాంధ్ర-2025 కార్యక్రమానికి సంబంధించి జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు యోగాపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని వాడవాడలా విజయవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈనెల 27న కాణిపాకం ఆలయంలో, జూన్ 2న పెనుమూరు మండలం పులిగుండు ఆలయంలో, జూన్ 9న చౌడేపల్లె మండలం బోయకొండ ఆలయంలో, 15న కుప్పం మండలం కంగుంది కోటలో యోగా కార్యక్రమాల నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని జిల్లా టూరిజం అధికారిని ఆదేశించారు. యోగా కార్యక్రమంలో పాల్గొనడానికి సచివాలయాల వారీగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. డీఆర్వో మోహన్ కుమార్, జిల్లా పర్యాటక అధికారి గౌరి, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్‌వో సుధారాణి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త రవికుమార్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బాలాజి, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఏహెచ్‌వో లోకేష్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



ప్రసన్నాంజనేయ విగ్రహం వద్ద ప్రసాదాలు పంపిణీ చేస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

హనుమజ్జయంతి సందర్భంగా గురువారం తిరుమలలోని బేడి ఆంజనేయస్వామి ఆలయంలో, మొదటిఘాట్‌రోడ్డులోని ఏడోమైలు ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించించారు. బేడి ఆంజనేయస్వామికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించింది. మధ్యాహ్నం ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద వేద మంత్రోచ్ఛరణలు, మేళతాళాల నడుమ ప్రత్యేక పూజలు, ఆస్థానం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. జపాలి ఆంజనేయస్వామికి టీటీడీ తరుపున ఛైర్మన్ బీఆర్ నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. పూజల అనంతరం అర్చకులు సిందూర వస్త్రంతో ఛైర్మన్‌ను సత్కరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




జపాలి ఆంజనేయస్వామికి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న బీఆర్ నాయుడు

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.24 కోట్లు
- బుధవారం దర్శించుకున్న భక్తులు: 80,964
- తలనీలాలు సమర్పించినవారు: 32,125



సత్యవేడు శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలం రాజకీయ భవిష్యత్తు త్రిశంకు స్వర్గంలోనే ఉంది. ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఆయన మీద టీడీపీ సస్పెన్షన్ మాత్రం గత సెప్టెంబరు నుంచీ కొనసాగుతోంది. ఇటీవల పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సత్యవేడు పర్యటనతో అటోఇటో తేలిపోతుందని అందరూ అనుకున్నా.. అటువంటిదేమీ జరగలేదు. నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు మాత్రం దిక్కుతోచని స్థితిలోనే ఉన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సత్యవేడు టీడీపీ నాయకుడెవరు?



- అయోమయంలో ఆదిమూలం భవితవ్యం
- సస్పెన్షన్‌లోనే ఎమ్మెల్యే
- స్పష్టత ఇవ్వని నారా లోకేశ్
- దిక్కుతోచని స్థితిలో టీడీపీ శ్రేణులు

ఆది నుంచీ వివాదాలు

వ్యక్తిత్వపరంగా ఎలాంటి లౌక్యం తెలియని రాజకీయ నాయకుడిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి పేరుంది. దాపరికం లేకుండా ముక్కుసూటిగా మాట్లాడే అలవాటుకు తోడు ఆవేశపరుడన్న ముద్ర ఉంది. వీటన్నిటికీ మించి ఎవరినీ లెక్కచేయరని సత్యవేడు రాజకీయాల్లో ఆయన గురించి తెలిసిన వారు చెబుతుంటారు. వీటి కారణంగా ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో కూడా సొంత పార్టీ నేతల నుంచీ వ్యతిరేకత ఎదుర్కొన్నారు. మరోవైపు కుటుంబ సభ్యుల్లో ఒకరి దూకుడు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చి పెట్టాయి. గత ఎన్నికల్లో తొలుత వైసీపీ అధిష్ఠానం సత్యవేడు అసెంబ్లీ టికెట్ నిరాకరించినా ప్రత్యామ్నాయంగా తిరుపతి ఎంపీ టికెట్ ప్రకటించింది. తర్వాత నిర్ణయం మార్చుకుని సత్యవేడు టికెట్‌నే ఖరారు చేసింది. అయితే పార్టీ అధిష్ఠానం తీరుతో తీవ్ర మనస్తాపానికి లోనైన ఆయన ఏకంగా పార్టీపైనే తిరుగుబాటు చేశారు. తన నియోజకవర్గంలో అక్రమాలకు మంత్రి పెద్దిరెడ్డే కారణమని బహిరంగ ఆరోపణలు చేశారు. ఆయనను నేరుగా సవాల్ చేశారు. ఆపై టీడీపీలో చేరి అసెంబ్లీ టికెట్ తెచ్చుకున్నారు. దీంతో ఆయన పట్ల సత్యవేడులోనే కాకుండా జిల్లావ్యాప్తంగా కూడా సానుభూతి వ్యక్తమైంది. పెద్దిరెడ్డిని ఎదిరించిన తీరు కూడా పార్టీలకు అతీతంగా పలువురికి నచ్చింది. టీడీపీ ప్రభంజనం కలసిరావడంతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు.

గెలిచిన ఆనందం అంతలోనే ఆవిరైన వైనం

సత్యవేడు ఎమ్మెల్యేగా రెండవ సారి గెలిచిన ఆనందం ఆదిమూలానికి ఎక్కువ రోజులు మిగల్లేదు. గతేడాది సెప్టెంబరులో ఆయన ఓ వివాదంలో చిక్కుకున్నారు. నియోజకవర్గంలో సొంత పార్టీకే చెందిన ఓ మహిళా నాయకురాలు ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసి, పోలీసులకు కూడా ఫిర్యాదు చేసారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ ఘటన సంచలనం సృష్టించింది. ఆయనపై క్రిమినల్ కేసు నమోదైంది. దానిపై ఆయన కేసు కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. అయితే ఫిర్యాదు చేసిన మహిళ అనూహ్యంగా హైకోర్టుకు వెళ్లి తన ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానని అభ్యర్థించడంతో ఆ వివాదం అంతటితో ముగిసింది. ఈలోపు పార్టీ ప్రతిష్ఠ దెబ్బతిన్న కారణంగా టీడీపీ అధిష్ఠానం ఆయనను పార్టీ నుంచీ సస్పెండ్ చేసింది. కేసు రాజీ పడినందున సస్పెన్షన్ ఎత్తివేస్తారని పార్టీ శ్రేణులు భావించినా సుమారు ఎనిమిది నెలలుగా అధిష్ఠానం దీనిపై దృష్టి సారించలేదు. ఈ ఎనిమిది నెలల్లో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనుల కోసం ఎన్నికల నాటి పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు, తర్వాత నియమితులైన శ్రీపతి బాబులను కలవాలో, సస్పెన్షన్‌లో ఉన్న ఎమ్మెల్యేను కలవాలో అర్థంకాని పరిస్థితిలో కేడర్ ఉన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే హేమలత కూడా నియోజకవర్గంలో కనిపిస్తున్నారు.

తొలగని అస్పష్టత

లోకేశ్ పర్యటన సమయంలో నియోజకవర్గానికి పూర్తిస్థాయి కో ఆర్డినేటర్ లేదా ఇంచార్జిని ప్రకటించడమో చేస్తారని భావించారు. నాయకుడెవరో స్పష్టతనిస్తే తమ సమస్యలు చెప్పుకోవడానికి, పనులు చేసుకోవడానికి వీలు కలుగుతుందని కార్యకర్తలు అనుకున్నారు. అయితే యువనేత ఈ అంశంపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. సమస్యలుంటే ఇద్దరు పరిశీలకుల దృష్టికి తీసుకెళ్ళాలని, లేదంటే జిల్లా ఇంఛార్జి మంత్రికి,పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి చెప్పాలని సూచించి వెళ్లిపోయారు. దీంతో ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఇప్పట్లో ఎత్తివేసే పరిస్థితి లేదని, అదే సమయంలో ఎవరినీ ఇంఛార్జిగా నియమించే పరిస్థితి కూడా లేదని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. పార్టీ నియమించిన పరిశీలకులకు నియోజకవర్గంపై చెప్పుకోదగ్గ పట్టు లేదు. అధికారులు, ఉద్యోగులపై పట్టు అంతకన్నా లేదు. ఇంఛార్జి మంత్రి అందుబాటులో వుండరు. దీంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో? పనులకు ఎవరిని ఆశ్రయించాలో? నామినేటెడ్ పదవులకు ఎవరు సిఫారసు చేస్తారో? తెలియక పార్టీ శ్రేణులు, ఆశావహులు గందరగోళంలో పడుతున్నారు.

శ్రీవారి సేవలో నిమ్మగడ్డ రమేష్‌కుమార్



తిరుమల, మే22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపానికి చేరుకున్న రమేష్‌కుమార్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం

- రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మోక్షిత్



మోక్షిత్‌ను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ - 2025లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతోపాటు విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... 6, 9 తరగతుల ప్రవేశాలకుగాను ఏప్రిల్ 5న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 9వ తరగతి విభాగంలో వి. మోక్షిత్ మొత్తం 400 మార్కులకుగాను 370 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. 6వ తరగతి విభాగంలో 300 మార్కులకుగాను హృతిక్ రాయల్ 281 మార్కులు, వి.నిహార్ 275, సోహిని 270 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. వీరితోపాటు రసజ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహీధర్, అశ్విన్ తదితరులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. గురువారం తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వి.మోక్షిత్ తదితర విద్యార్థులను అభినందించారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు గణితంలో 150/150, ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో 50/50 మార్కులు పొంది రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని వెల్లడించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలువేస్తూ అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న అధ్యాపక బృందానికి, ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. సమాచారం కావాల్సిన వారు 8688888802/9399976999లలో సంప్రదించాలని సూచించారు.

తిరుపతి బాలిక గిన్నిస్ రికార్డు



తిరుపతి అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎల్బీనగర్‌కు చెందిన ఆరవ కీర్తన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించింది. గత ఏడాది డిసెంబర్ 1న హలెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ ఆగస్టిన్ ఆధ్వర్యంలో 18 దేశాల నుంచి 1,500మంది బాలబాలికలు గంటపాటు ఎలక్ట్రిక్ కీబోర్డ్ ప్లే చేసి గిన్నిస్ రికార్డు కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కీర్తన అంతరాయం లేకుండా ఎలక్ట్రిక్ కీబోర్డ్ ప్లే చేసి గిన్నిస్ రికార్డుకు ఎంపికైనట్లు గిన్నిస్ వరల్డ్ రికార్డు టీమ్ సభ్యుడు రిచర్డ్(యూకే) గత ఏడాది డిసెంబర్ 14న ప్రకటించారు. విజయవాడకు చెందిన హలెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ ఆగస్టిన్ ఏప్రిల్ 14న కీర్తనకు సర్టిఫికెట్, సిల్వర్‌మెడల్ ప్రదానం చేశారు. ఆ బాలికను, తల్లిదండ్రులు విజయబాబు, శైలజలను పలువురు అభినందించారు.

వెట్టికి బలైన బాలుడి కేసులో ముగ్గురికి రిమాండ్



నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు


సత్యవేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల గిరిజన బాలుడితో వెట్టి చాకిరి చేయించుకుని, అతడి మృతికి కారణమైన ఘటనలో ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సత్యవేడు సీఐ కార్యాలయంలో గురువారం ఈ వివరాలను పుత్తూరు డీఎస్పీ రవికుమార్ మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. గూడూరు మండలం చవటపాళెం గిరిజన కాలనీకి చెందిన చెంచయ్య భార్య అంకమ్మ తన ముగ్గురు పిల్లలు, ప్రియుడితో కలిసి రెండేళ్ల కిందట సత్యవేడుకు వలసొచ్చారు. దళవాయి అగ్రహారంలోని ముత్తు వద్ద నెలకు రూ.10 వేల జీతానికి బాతులు మేపుతున్నారు. ఏడాది కింద చెంచయ్య మృతి చెందడంతో ఆమె చవటపాళెం వెళ్లారు. కర్మక్రియల అనంతరం అంకమ్మ సత్యవేడుకు వస్తుండగా.. అదే గ్రామానికి చెందిన సతీష్‌కు ఆమె రూ.25 వేల అప్పు ఉండడంతో, అతడు అడ్డుకున్నాడు. ఈ విషయం తెలిసి బాతుల వ్యాపారి ముత్తు చవటపాళెం వెళ్లి ఆ మొత్తాన్ని చెల్లించి అంకమ్మను సత్యవేడుకు తీసుకొచ్చి పనిలో పెట్టుకున్నాడు. అంకమ్మ, ఆమె పిల్లల చేత ముత్తు కుటుంబీకులు ఎక్కువ పనులు చేయించుకునే వారు. జీతం మాత్రం పెంచేవారు కాదు. దీంతో ఆమె పది నెలల క్రితం వెళ్లిపోతామని చెప్పడంతో, తన బాకీ రూ.42 వేలు చెల్లించాలని ముత్తు పట్టుబట్టాడు. పది రోజుల్లో బాకీ చెల్లిస్తానంటే.. అప్పటి వరకు పిల్లాడిని (వెంకటేశులను) వదిలి వెళ్లాలని చెప్పాడు. దీంతో ముత్తు వద్ద ఉండిపోయిన వెంకటేశ్వర్లు బాతులు మేపే క్రమంలో ఆ బాలుడిని కంచికి తీసుకెళ్లాడు. అక్కడ ఏప్రిల్ 11న బాలుడు అనారోగ్యానికి గురికాగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ముత్తు చేర్పించాడు. చికిత్స పొందుతూ 12వ తేదీ మృతి చెందాడు. ఈ విషయాన్ని ముత్తు తన భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్‌కు చెప్పాడు. వారు కంచికి వెళ్లి బాలుడి మృతదేహాన్ని పాలారు నది ఒడ్డున పూడ్చి పెట్టేశారు. ఈ విషయాన్ని అంకమ్మకు చెప్పలేదు. నెలగా కుమారుడు ఫోన్ చేయకపోవడంతో 20 రోజుల క్రితం అంకమ్మ సత్యవేడుకు వచ్చి ముత్తును అడిగింది. కంచి పరిసర ప్రాంతాలలో బాతులు మేపేందుకు వెళ్లగా వెంకటేశ్వర్లు తప్పిపోయాడని, వెతికి తీసుకొస్తామని ఆమెను పంపించేశాడు. మళ్లీ ఈ నెల 15వ తేదీన వచ్చి బాకీ చెల్లించేస్తానని, తన బిడ్డను అప్పజెప్పాలని వేడుకుంది. ఇంకా పిల్లాడు దొరకలేదని చెప్పడంత ఆమె గట్టిగా నిలదీసింది. ముత్తు, అతడి భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్ కలిసి అంకమ్మను కులం పేరుతో దూషించి బయటకు గెంటేశారు. దీనిపై ఈనెల 19వ తేదీన ఆమె సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రామస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సత్యవేడుకు చేరుకుని విచారణ చేపట్టి, ముత్తుతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో సీఐ మురళి, వరదయ్యపాళెం, పిచ్చాటూరు ఎస్‌ఐలు మల్లికార్జున, వెంకటరమణ, సిబ్బంది మంగళవారం కంచికి వెళ్లి.. తమిళనాడు పోలీసుల సాయంతో బాలుడి మృతదేహం కోసం గాలించారు. బుధవారం సాయంత్రం గుర్తించి మృతదేహాన్ని వెలికి తీశారు. కంచి తాలూకా మెజిస్ట్రేట్ రఫీక్ ఆధ్వర్యంలో బాలుడి తల్లి అంకమ్మ సమక్షంలో శవానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు మెడికల్ కాలేజీకి తరలించినట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు.

కష్టంగా ఉందమ్మా.. నన్ను తీసుకెళ్లమ్మా

బాతులు మేపే క్రమంలో బాలుడు వెంకటేశులను యజమాని ముత్తు చాలా హింసించేవాడని తెలిసింది. ముత్తు దగ్గర ఉన్న వెయ్యి బాతులను ఆ పసిపిల్లాడు ఒక్కడే మేపేవాడని, అతడితో విపరీతమైన పని చేయించుకునేవాడని తెలిసింది. ఈ క్రమంలో బాలుడిని ఎక్కడికి పోనివ్వకుండా పారిపోతే చంపేస్తా, కేసు పెట్టి జైలులో వేస్తానంటూ బెదిరిస్తూ కర్కశంగా వ్యవహరించే వాడని తెలిసింది. వెంకటేశులు తల్లికి ఫోన్ చేసినప్పుడల్లా ఇదే విషయం తల్లితో చెప్పి ఏడ్చేవాడని పోలీసుల విచారణలో కనుగొన్నారు. డబ్బులు కుదరలేదని, డబ్బులు వచ్చిన వెంటనే వచ్చి విడిపించుకుని వెళతానని తల్లి అంకమ్మ బాలుడికి నచ్చచెప్పేదని తెలిసింది.

టీడీపీ శ్రేణులకు అండగా..!

- గత కార్పొరేషన్ ఎన్నికల్లో తలపడ్డ వారికే మళ్లీ అవకాశం
- తిరుపతిని ఫ్లెక్సీ, ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా మారుస్తాం
- మినీ మహానాడులో తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి గత కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీచేసిన 23 మంది కార్పొరేట్ అభ్యర్థులకే తిరిగి అవకాశం ఇవ్వాలని తిరుపతిలో గురువారం జరిగిన మినీ మహానాడులో తీర్మానించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, ఏపీసీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ మాట్లాడుతూ.. గత ఐదేళ్లు పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని చెప్పారు. కాస్త ఆలస్యమైనా పార్టీ కేడర్‌కు ఇబ్బందిలేకుండా చూసుకుంటామన్నారు. ప్రభుత్వ రంగసంస్థల్లోని కాంట్రాక్టు పనుల్లో పార్టీ నాయకుల్లో ప్రాధాన్యత, పార్టీ నాయకుల కుటుంబ సభ్యులకు వివిధ సంస్థల్లో అర్హతను బట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని నిర్ణయించారు. తిరుపతి నగరాన్ని బ్యానర్ ఫ్రీ, ప్లాస్టిక్‌రహిత నగరంగా ఉంచాలని రాబోయే రోజుల్లో మరిన్ని మొక్కలునాటి సుందరంగా తీర్చిదిద్దాలన్న సుగుణమ్మ ప్రతిపాదనతో తీర్మానం చేశారు. ఈనెల 27 నుంచి కడపలో జరగనున్న మహానాడుకు భారీగా తరలి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ నాయకులు మల్లవరం స్వాతి, ఎం.లక్ష్మీదేవమ్మ, వసంతమ్మ, 17వ డివిజన్ ప్రధాన కార్యదర్శి హేమావతి భర్త శివయ్య, ఎమ్మార్‌పల్లి నాగేంద్రబాబు కుమారుడు చేతన్ మృతిపట్ల సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు బి.వి.కీర్తి, మబ్బు దేవనారాయణ రెడి, రుద్రకోటి సదాశివం, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, పులిగోరు మురళీకృష్ణ రెడ్డి, శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్, నూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, బీజీ కృష్ణయాదవ్, పుష్పావతి, బ్యాంక్ శాంతమ్మ, కుమారమ్మ, కరాటే చంద్ర, మునిశేఖర్ రాయల్, సుబ్బు యాదవ్, రేవతి, సూర్యకుమారి, రాజారం, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పూర్ణ-తిరుపతి ప్రత్యేక రైలుకు అదనపు బోగీలు

తిరుపతి(సెంట్రల్), మే 22(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ కారణంగా పూర్ణ-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల(07609-07610)కు జూలై ఒకటో తేదీ వరకు మూడు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2ఏసీ-1, 3ఏసీ-1, స్లీపర్ క్లాస్-1 కోచ్‌లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విత్తనం చల్లుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పచ్చిరొట్ట సాగుకు సబ్సిడీపై విత్తనాల కిట్లు

దొరవారిసత్రం, మే 22(ఆంధ్రజ్యోతి) : ఈ యేడాది జిల్లా వ్యాప్తంగా 25 వేల ఎకరాల్లో పీఎండీఎస్ కింద చిరు ధాన్యాల విత్తలనాలతో పచ్చిరొట్ట పంట సాగుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. దొరవారిసత్రం మండలం లింగంపాడు గ్రామంలో పది రకాల చిరు ధాన్యాలు కలిపిన విత్తనాలతో పచ్చిరొట్ట సాగు చేసిన గోవర్ధన్ పొలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. చిరుధాన్యాలతో కూడిన కిట్లను 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఈసాగు వల్ల రసాయనిక ఎరువుల వాడకంతో పాటు పెట్టుబడులు తగ్గుతాయన్నారు. తర్వాత ఆయన చిరు ధాన్యాలను పొలంలో చల్లారు. నెర్రికాలువను బాగు చేయించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం షణ్ముగం, ఏడీఏ అనిత, ఏవో జ్యోతిర్మయి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలి

- వెంకటగిరి మినీ మహానాడులో తీర్మానం

వెంకటగిరి, మే 22 : (ఆంధ్రజ్యోతి) వెంకటగిరిలో గురువారం నిర్వహించిన మిని మహానాడులో మంత్రి నారా లోకేశ్‌కు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ పెసిడెంట్ హోదా కల్పించాలని, ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని ఎకగ్రీవంగా తీర్మానించారు.ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం, సోమశిల-స్వర్ణముఖి లింకు కెనాల్ పూర్తి, వెంకటగిరి- గూడూరు రోడ్డు పనులు,వెంకటగిరిలో చేనేత.. బీఆర్ అంబేడ్కర్ భవనాల నిర్మాణం, రాపూరు చెరువును రిజర్వాయరుగా మార్చడం, పోకూరుపల్లి లిఫ్టు ఇరిగేషన్ మంజూరు, వెంకటగిరిలో 30 పడకల ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడం వంటి అభివృద్ధి పనులను సభ తీర్మానం చేసింది.

ట్రావెల్స్ బస్సు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), మే 22 (ఆంధ్రజ్యోతి):ఏకంగా ఓ ట్రావెల్స్ బస్సునే దుండగులు దొంగిలించారు. ఈ ఘటన తిరుపతిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. బుధవారం రాత్రి టీఎన్ 02బీయూ 1030 నెంబరు బస్సును డ్రైవర్ శ్రీధర్ తీసుకొచ్చి చింతలచెరువు రోడ్డులోని ఓ పార్కింగ్ ప్లేస్‌లో ఉంచారు. బస్సును గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని ఆ పార్కింగ్ యజమాని ఫోన్ చేసి డ్రైవరుకు చెప్పడంతో అతడు, మరికొందరితో కలిసి చుట్టుపక్కల వెతికారు. బస్సు కనిపించకపోవడంతో ఓనర్ రవీంద్రకు డ్రైవరు తెలియజేశారు. ఎక్కడా బస్సు కనిపించకపోవడంతో గురువారం ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ కేసు నమోదు చేశారు.కాగా గురువారం మధ్యాహ్నం 2గంటలకు పుంగనూరు సమీపంలో ప్రమాదానికి గురైన ఆ బస్సును పోలీసులు గుర్తించి యజమానికి సమాచారమిచ్చారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 579 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం జరిగిన పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 579 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 31 కేంద్రాల్లో 4,436 మంది హాజరు కావాల్సి ఉండగా 3,857 మంది పరీక్షలు రాశారని వివరించారు. అలాగే ఓపెన్ స్కూల్ పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు 8 కేంద్రాల్లో జరుగుతున్నాయని, గురువారం గణిత పరీక్షకు 435 మంది విద్యార్థులకుగాను 54మంది గైర్హాజరయ్యారని తెలిపారు.ఓపెన్ స్కూల్ ఇంటర్ ఫిజికల్ సైన్స్, పొలిటికల్ సైన్స్ పరీక్షలకు 60 మంది గైర్హాజరయ్యారని వివరించారు.



ధ్యానం చేస్తున్న ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ, చుడా చైర్‌పర్సన్



యోగా గురువులు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధికారులు, సీనియర్ సిటిజన్లు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. గురువారం స్థానిక పీవీకేఎన్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా మాసోత్సవ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సర్వరోగ నివారిణి అయిన యోగాను జీవితంలో ఓ భాగం చేసుకుని, సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేసుకోవాలని సూచించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడిని దూరంగా చేసుకోవచ్చన్నారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ.. పోలీసులకు యోగాపై ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఏడు పదుల వయస్సులో కూడా చురుగ్గా ఉండడానికి కారణం యోగానే అని చెప్పారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే యోగా ఒక్కటే మార్గమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. డీఆర్వో మోహన్‌కుమార్, అధికారులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్

చిత్తూరు సెంట్రల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏపీ ఈఏపీసెట్) జిల్లాలో గురువారం ప్రశాంతంగా జరిగాయి. రెండు సెషన్లలో నిర్వహించిన పరీక్షల్లో 1,236 మంది విద్యార్థులకు 1,168 మంది హాజరవగా, 68 మంది గైర్హాజరయ్యారు. ఫస్టు సెషన్‌లో 618 మందికి 581 మంది, రెండో సెషన్‌లో 618 మందికి 587 మంది విద్యార్థులు హాజరయ్యారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 923 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మే 22 (ఆంధ్రజ్యోతి): టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో వరలక్ష్మి, ఏసీ వెంకటేశ్వరరావు తెలిపారు. మొత్తం 6,913 మంది విద్యార్థులకు 923 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. టెన్త్ జనరల్‌లో గణితం పరీక్షకు 578 మంది,ఓపెన్ స్కూల్ టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన గణిత పరీక్షకు 127మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఇంటరులో భౌతిక, రాజనీతి, పౌర, మనో విజ్ఞాన శాస్త్రం సబ్జెక్టుల్లో నిర్వహించిన పరీక్షలకు 1,069 మందికి 218 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

ఎమ్మెల్యే కార్యాలయాల్లో నేడు ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కార్యాలయాల్లో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ● చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం వరకు తన నియోజకవర్గ పరిధిలోని బాధితుల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. ● లక్ష్మీనగర్ కాలనీలోనే ఉన్న ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ కార్యాలయంలోనూ ఉదయం 11 గంటల నుంచి తన నియోజకవర్గ పరిధిలోని బాధితుల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. వినతిపత్రంతోపాటు ఆధార్ కార్డు జెరాక్స్ జత చేయాలి.

జాతీయ కుస్తీ పోటీలకు జీవనగీత ఎంపిక



యాదమరి, మే 22 (ఆంధ్రజ్యోతి): యాదమరి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని జీవనగీత జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైంది. గతవారం చిత్తూరులోని మెసానికల్ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈమె బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, పీడీలు రవి, దాము, హరికృష్ణ తెలిపారు. దీంతో చండీగఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ఆడనున్నట్లు పేర్కొన్నారు.

గుర్తింపులేని రెండు పాఠశాలల మూసివేత

చిత్తూరు సెంట్రల్, మే 22 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో గుర్తింపులేని రెండు పాఠశాలలు మూసివేసినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. కుప్పం మండలంలోని పార్లపల్లె గుండుగాంపల్లెలోని హాకింగ్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, రామకుప్పంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలను మూసివేసినట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులను వారి తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రభుత్వ పాఠశాలల్లో లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. మూసివేసిన పాఠశాలల్లోని విద్యార్థుల టీసీల కోసం ఎంఈవోను సంప్రదించాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ అజెండా

● జిల్లా మహానాడు సభలో ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన అజెండా అని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం జిల్లాస్థాయి మహానాడును నిర్వహించారు.దేశరక్షణ కోసం పోరాడుతూ మరణించిన జవాన్లకు, వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన టీడీపీ నేతలకు, కార్యకర్తలకు తొలుత నివాళులర్పించారు. సభలో ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. తిరుపతి - కాట్పాడి డబుల్ లైన్ ఏర్పాటుకు కేంద్రం రూ.1,332 కోట్లు మంజూరు చేసిందని, ఈ లైన్ ఏర్పాటైతే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఆగుతాయని తెలిపారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలో రూ.60 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతుల కల్పనకు పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించనున్న మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీమోహన్, గాలి భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు ఏఎస్ మనోహర్, గాంధీ, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, నేతలు చంద్రప్రకాష్, చిట్టిబాబు, కోదండయాదవ్, మోహన్‌రాజ్, త్యాగరాజన్, రామచంద్ర నాయుడు, అశోకన్, కార్జాల అరుణ, నాగేశ్వరరావు, దశరథ వాసు తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు ఆహ్వానం

కడపలో ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే మహానాడు కార్యక్రమానికి జిల్లాలోని తెలుగు తమ్ముళ్లకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అందుతున్న ఆహ్వాన పత్రిక ఇది.





అమరవీరులకు, మృతి చెందిన టీడీపీ నేతల ఆత్మశాంతికి మౌనం పాటించి నివాళులర్పిస్తున్న నేతలు

మహానాడులో 26 తీర్మానాలు

● సెంట్రల్ మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలి.మామిడి పంటకు గిట్టుబాటు ధర ఇప్పించాలి ● 2014-19 నడుమ ఉపాధి, నీరు చెట్టు పథకాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను 24 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలి ● గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన పక్కా గృహాలు, రూరల్ హౌసింగ్ ఇళ్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరడం. ● వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలి ● చంద్రగిరి మండలంలోని ఐతేపల్లె నుంచి రంగంపేటవరకు ఉన్న స్వర్ణముఖి నదిపై, తిరుపతిరూరల్ మండలంలోని వేదాంతపురం నుంచి రాయలచెరువుమీదుగా పచ్చికాపలం, కొత్తపల్లె మిట్ట స్వర్ణముఖి నదిపై హైలెవల్ వంతెనల నిర్మాణం చేపట్టాలి ●చెరువులు, కుంటలు, ఇరిగేషన్ కాలువల్లో పూడిక తీయడానికి నిధులు కేటాయించాలి ● భూముల రీ సర్వేలో జరిగిన తప్పిదాలను జాప్యం లేకుండా సవరించడం ●జిల్లా నుంచి పక్క రాష్ట్రాల్లోని ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్న వారికి వర్క్ ఫ్రం హోం విధానాన్ని అమలు చేయడం ● జిల్లా కేంద్రాన్ని పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేయాలి.

టన్ను మామిడికి రూ.25 వేలు ఇవ్వాలి

● చర్చా వేదికలో మామిడి రైతుల డిమాండ్

చిత్తూరు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నుంచి ప్రారంభమయ్యే మామిడి సీజన్‌లో టన్నుకు రూ.25 వేల మద్దతు ధర ప్రకటించాలని రైతులు కోరారు. మామిడి రైతులతో, మామిడి గుజ్జు ఫ్యాక్టరీల యజమానులతో కలెక్టరేట్‌లో గురువారం చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రవాణా, కటింగ్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. మామిడికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంలో అధికారులు చిత్తశుద్ధి చూపాలన్నారు. పెరిగిపోతున్న క్రిమిసంహారక మందుల ధరలను అదుపుచేయాలని కోరారు. గత ఏడాది సరఫరా చేసిన తోతాపురికి ఇప్పటివరకు గుజ్జుఫ్యాక్టరీ యజమానులు బిల్లులు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బంగారుపాళ్యం మ్యాంగో మార్కెట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి మామిడి తెచ్చి ఇక్కడి మామిడి రకాలతో పోటీ పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

దశలవారీ కోతలతోనే సరైన ధర సాధ్యం

ఎక్కడా లేనివిధంగా మామిడి గుజ్జు పరిశ్రమలు ఎక్కువ సంఖ్యలో జిల్లాలో ఉన్నాయని, యుద్ధాల కారణంగా గత ఏడాది కాలంగా మామిడి గుజ్జు ఎగుమతులు లేక నిల్వలు భారీగా పెరిగిపోయాయని మామిడి గుజ్జు పరిశ్రమల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.దశలవారీగా మామిడి కోతలు సాగిస్తే రైతులకు సరైన ధర అందించేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిత్తూరు ఎంపీ ప్రసాదరావు మాట్లాడుతూ మామిడి రైతులు, మామిడి గుజ్జు పారిశ్రామికవేత్తలకు సమన్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సంబంధిత శాఖలకు అందించడంతో పాటు కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేసే మామిడి గుజ్జుపై దిగుమతి సుంకం తగ్గించాలనికు వాణిజ్య శాఖ మంత్రిని కోరామన్నారు. ఉద్యానశాఖ డైరక్టర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడి గుజ్జు, జ్యూస్‌లపై జీఎస్టీ ఎత్తివేత అంశాన్ని సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళారన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ మామిడి సీజన్‌లో తోతాపురి రకానికి సంబంధించి గిట్టుబాటు ధర విషయంలో రైతులు, మామిడి గుజ్జు ప్రాసెసింగ్ యూనిట్ల సమన్వయం ఎంతో అవసరమన్నారు. గిట్టుబాటు ధర కల్పించే విషయంలో రైతులకే తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. తోతాపురి మామిడి రైతులకు న్యాయం జరిగేలా ప్రాసెసింగ్ కంపెనీల యజమానులతో చర్చించి ముందుకు వెళ్తామని చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ చెప్పారు. 2018లో కూడా చంద్రబాబు తోతాపురి రకానికి మద్దతు ధర ప్రకటించారని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ గుర్తు చేశారు.నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ తోతాపురితో పాటు ఇతరరకాల మామిడి సాగుపై రైతులు దృష్టి పెట్టడం లేదని వాపోయారు. పండించే పంటను ఎగుమతి చేసేందుకు ప్లాంట్ రేడియేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మామిడిరైతుల కష్టాలు తెలిసిన వారని, వారి కష్టాలు తీర్చే బాధ్యత ఆయనే తీసుకుంటారన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల జేసీలు శుభం బన్సల్, విద్యాధరి, ఆదర్శ రాజేంద్రన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డీఆర్వో మోహన్‌కుమార్, మూడు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు మధుసూధన రెడ్డి, దశరథరామి రెడ్డి, రవిచంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.



మామిడి రైతులతో జరిగిన చర్చావేదికలో పాల్గొన్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

శ్రీవారి భక్తులకు మ్యాంగో జ్యూస్ సరఫరా చేయాలి

తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు జిల్లా రైతులు ఉత్పత్తి చేసే మామిడి శీతల పానీయాలను టెట్రాప్యాకెట్లలో ప్రభుత్వం సరఫరా చేయాలని టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ కోరారు. మ్యాంగో జ్యూస్ టెట్రా ప్యాకెట్లపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ట్యాక్స్‌ను తగ్గిస్తే ప్రజలు విరివిగా కొనుగోలు చేస్తారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మామిడి పంట బీమా పథకంపై రైతుల సలహాలు, సూచనలు తీసుకుని మార్పులు చేయాలని కోరారు.ఎకరా మామిడి పంటకు నష్టపరిహారంగా రూ.80 వేలు ప్రకటించాలని కోరారు.



అమర వీరులకు సెల్యూట్

పలమనేరు, మే 22 (ఆంధ్రజ్యోతి):దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన సైనికుల ధైర్యసాహసాలను మనందరం ప్రశంసించాలంటూ పలమనేరులో గురువారం భారీఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించారు.టవర్‌క్లాక్ వద్ద మానవహారం నిర్మించారు.ఎమ్మెల్యే అమర్ సతీమణి రేణుకారెడ్డి,తహసీల్దార్ ఇన్బనాథన్,టీడీపీ,జనసేన, బీజేపీ, వైసీపీ నేతలు, ప్రజాసంఘాలనాయకులు, పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు, మాజీ సైనికోద్యోగులు, పెద్ద సంఖ్యలో పురప్రజలు పాల్గొన్నారు.



కరెంటు లేకుండా ఎన్నాళ్లుండాలి?

● మూడేళ్లుగా కనెక్షన్ ఇవ్వలేదన్న ఫిర్యాదుతో డీఈపై ప్రత్యేక విద్యుత్ అదాలత్ చైర్మన్ ఆగ్రహం

చిత్తూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): తమకు మూడేళ్లుగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదంటూ బంగారుపాళ్యం కేజీ సత్రానికి చెందిన నిర్మల ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత డీఈ కొండయ్యపై ప్రత్యేక విద్యుత్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆగ్రహించారు. కరెంటు లేకుండా ఎన్నాళ్లుండాలని ప్రశ్నించారు. గురువారం స్థానిక గాంధీరోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ వినియోగదారుల కోసం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ.. మూడేళ్ల కిందట నగదు చెల్లించినా ఇప్పటి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఈని విచారించగా, 'కనెక్షన్ ఇవ్వడానికి వేరే వారి పొలం నుంచి తీగలు లాగాలి. ఆ పొలానికి చెందినవారు ఒప్పుకోవడం లేదు' అని సమాధానం చెప్పారు. వెంటనే సర్వీసు ఇవ్వాలని చైర్మన్ ఆదేశించారు. ఎవరైనా విధులకు ఆటంకం కల్గిస్తే కేసు పెట్టాలని సూచించారు. అదాలత్‌లో మొత్తం 9 ఫిర్యాదులు రాగా, వాటిని 15 రోజుల్లో పరిష్కారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చేయలేకుంటే సరైన కారణాలు తెలపాలన్నారు. కేజీసత్రం ఫిర్యాదుతోపాటు మురకంబట్టులో కొత్త సర్వీసుల కోసం మూడు, చిత్తూరు రూరల్ పరిధిలో వాణిజ్య సర్వీసు బిల్లు రివిజన్‌పై ఒకటి, అదనపు లోడ్ రివైజ్‌కు ఒకటి, రెడ్డిగుంటలో పేరు మార్పుపై ఒకటి, కొత్తపల్లెలో కేటగిరీ మార్పుపై ఒకటి, విద్యుత్ లైన్ బిగుతు చేయాలని ఒకటి చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదాలత్ ఆర్థిక సభ్యులు రామమోహన్, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్, ఏఈలు పాల్గొన్నారు.



బంగారుపాళ్యం డీఈ కొండయ్యను విచారిస్తున్న అదాలత్ చైర్మన్, సభ్యులు

మళ్లీ ఎండవేడి

చిత్తూరు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగైదు రోజులుగా తగ్గిన ఎండలు గురువారం నుంచి మళ్లీ పెరగడం ప్రారంభించాయి. అత్యధికంగా తవణంపల్లెలో 36.8, అత్యల్పంగా రామకుప్పంలో 26.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది.నగరిలో 35.6, శ్రీరంగరాజపురంలో 34.8, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పంలో 34.5, చిత్తూరు, గుడిపాలలో 34.2, గంగాధరనెల్లూరులో 33.9, సోమలలో 33.6, బంగారుపాళ్యంలో 33.2, బైరెడ్డిపల్లె, ఐరాల, వి.కోట, యాదమరి, పాలసముద్రం, చౌడేపల్లె, పెనుమూరు, గంగవరం, విజయపురం, నింద్రలో 32.9, గుడుపల్లె, శాంతిపురంలో 32.6, కార్వేటినగరం, సదుంలో 32.4, పెద్దపంజాణిలో 31.9, రొంపిచెర్లలో 31.2, కుప్పంలో 30.8, పలమనేరులో 30.6, పెనుమూరులో 30 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పరిశోధనలతోనే వైద్య శాస్త్రాభివృద్ధి



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణారావు తదితరులు

కుప్పం, మే 22 (ఆంధ్రజ్యోతి): పరిశోధనతోనే వైద్య శాస్త్రాభివృద్ధి సాధ్యమవుతుందని పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అండ్ డీన్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు అన్నారు. కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, మెడికల్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర స్థాయి పరిశోధన పద్ధతులపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించడానికి పరిశోధన ఒక కీలకమైన సాధనమన్నారు. వర్క్‌షాప్ ఈనెల 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఇందులో వైద్య అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, యువ పరిశోధకుల కోసం వివిధ శిక్షణ సెషన్లు, వర్క్‌షాప్‌లు, నిపుణుల పరస్పర చర్చలు నిర్వహిస్తామని చెప్పారు. పరిశోధన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రతినిధులు ఈ వర్క్‌షాప్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైద్యమండలి పరిశీలకులు రమేశ్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ చిత్రా నాగరాజ్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వైద్య కళాశాలల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు ప్రజల్లోనే ఉండాలి: చల్లా



చల్లాను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలకు పరిష్కారం చూపాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ మలిరెడ్డిగారిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు జనార్దన్‌రెడ్డి టీడీపీలో చేరడంతో గురువారం సాయంత్రం ఆయన ఇంటికి చల్లా విచ్చేశారు. ఈ సందర్భంగా అయన్ను టీడీపీ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. పంచాయతీలో నెలకొన్న సమస్యలను స్థానిక నాయకులు చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పుంగనూరు టీడీపీ పరిశీలకులు దంపూరి భాస్కర్, మాజీ ఎంపీటీసీ లోకేష్, నాయకులు ధనంజయనాయుడు, మురళీధర్ నాయుడు, చెన్నుపాటి ధనంజయనాయుడు, చెంగల్రాయనాయుడు, పురుషోత్తంనాయుడు, అరుణాచలంనాయుడు, వెంకటేష్, ప్రభాకర్ నాయుడు, గురప్ప, జయకుమార్, సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



రొంపిచెర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలోని నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటి వద్ద గురువారం పులిచెర్లలోని కావేటిగారిపల్లికు చెందిన వైసీపీ నాయకులు జనార్దన్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు టీడీపీలో చేరారు. చల్లా రామచంద్రారెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారికి గుర్తింపు, గౌరవం ఉంటుందని తెలిపారు.

పుంగనూరు తాగునీటి సమస్య పరిష్కరించండి



మంత్రి నారాయణతో రామకృష్ణమరాజు

పుంగనూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు పుంగనూరు టీడీపీ నాయకుడు, కౌన్సిలర్ రామకృష్ణమరాజు విన్నవించారు. గురువారం విజయవాడలోని మంత్రి స్వగృహంలో కలిసి పుంగమ్మ చెరువులో నిర్మించిన సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు ద్వారా తాగునీటి సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ పరిధిలోని రియల్ ఎస్టేట్ కోసం కేటాయించిన భూముల నుంచి వచ్చిన ఆదాయాన్ని మున్సిపాలిటీకి మళ్లించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

బీజేపీ అభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ కన్వీనర్ మదనమోహన్

పుంగనూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ పటిష్టతకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని బీజేపీ కన్వీనర్ మదనమోహన్ అన్నారు. గురువారం స్థానిక త్యాగరాజస్వామి ఆలయంలో జరిగిన మండల బీజేపీ కార్యకర్తల సమావేశంలో పుంగనూరు పట్టణ అధ్యక్షుడు ఎం.జగదీశ్‌రాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బీజేపీ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పని చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నడుస్తోందని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న కార్యక్రమాలు వివరించాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు మల్లికారాణి, నానబాల కుమార్, ప్రసాద్, మఠంబాబు, ఉమామహేశ్వర్, మణి మొదలియార్, చంద్ర, నాగరాజ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్లకు పని ఒత్తిడి తగ్గించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్వేయర్లు

పుంగనూరు రూరల్, మే 22 (ఆంధ్ర జ్యోతి): తమకు విధి నిర్వహణలో పని ఒత్తిడి తగ్గించేలా చర్యలు తీసుకోవాలని గురువారం స్థానిక తహసీల్దార్ రాముకు సర్వేయర్లు వినతిపత్రం అందించారు. రీ సర్వేకి కేటాయించడంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేకపోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు సురేంద్ర నాయక్, భార్గవ్, విష్ణు, కిరణ్మయి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కమిటీలు ఏకగ్రీవం



సుబాన్‌సాబ్‌ను సన్మానిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు పంచాయతీల్లో గురువారం జరిగిన టీడీపీ పంచాయతీ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దకొండామారి పంచాయతీ అధ్యక్షులుగా సుబాన్‌సాబ్, వెంగళపల్లె పంచాయతీ అధ్యక్షులుగా ఆనంద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని టీడీపీ నాయకులు శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, కుమార్‌రెడ్డి, మునివెంకటరమణ, బాలిరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా గంగమ్మ జలాధివాసం



అమ్మవారి ఊరేగింపు

సోమల, మే 22(ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో జరిగిన గంగ జాతర వేడుకల్లో భాగంగా గురువారం అమ్మవారి జలాధివాసం కార్యక్రమం కోలాహలంగా సాగింది. స్థానిక శివాలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని పల్లకిలో అలంకరించి బాణాసంచా, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. అడుసుపల్లె సమీపంలోని చెరువు వద్దకు తీసుకెళ్లడంతో మార్గం మధ్యలోని దళితవాడ, అడుసుపల్లె, బుంగావారిపల్లె, గుంతచెరువుపల్లె గ్రామాల ప్రజలు, మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా జలాధివాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో సోమల గంగజాతర ముగిసింది. కార్యక్రమంలో వరదం వెంకటరమణ, చెన్నరాయప్ప, సుధాకర్, శివాలయం రాయల్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీని బలోపేతం చేయాలి



ఆనంద్‌ను సన్మానిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి

పుంగనూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఏటవాకిలి గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడిగా ఆనంద్, మేలుందొడ్డి గ్రామకమిటీ అధ్యక్షుడిగా వెంకటరమణ, సింగిరిగుంటకు మంజునాథ్, మాగాండ్లపల్లెకు శేఖర్‌బాబులనుఎ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగాధర్, మోహన్‌రెడ్డి, సోము, ప్రసాద్‌స్వామి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు దారుణం



బాధితుడిని పరామర్శిస్తున్న అశోక్‌కుమార్

పుంగనూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): దళితులపై దాడులు పెరుగుతున్నాయని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ ఆరోపించారు. గురువారం పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దపంజాణి మండ లం నెర్నిపల్లెకి చెందిన నాగప్పను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగప్ప గత 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని దున్నుతుండగా అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం, కృష్ణప్ప, గోపాల్, వాసు, రాయప్ప, వెంకటప్ప తదితరులు దాడి చేసి గాయపరచడంతో పాటు కులం పేరుతో దూషించడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట దళిత నాయకులు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్

బైరెడ్డిపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో ప్రజలకు వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ సూచించారు. మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం వైద్యసిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, సూపర్‌వైజర్ శ్రీదేవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బాలాలయం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పలమనేరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని భూనీలా కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం వేదపండితులు శాస్త్రోక్తంగా బాలాలయం నిర్వహించారు. పలమనేరు ఆర్యవైశ్య అధ్యక్షులు ఆర్.వి. సుభాష్‌చంద్రబోస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

పుంగనూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నెకి చెందిన సావిత్రమ్మపై అదే గ్రామానికి చెందిన కృష్ణప్ప, శివ, మురళీ, రమేశ్, గంగాధర్, గిరి ఇంట్లోకి చొరబడి దాడి చేశారంటూ కేసు నమోదయ్యింది.సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తలపై
అక్రమ కేసులు ఎత్తేయండి

చల్లా రామచంద్రారెడ్డి



మినీ మహానాడులో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

సోమల, మే 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులపై గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. గురువారం సోమల ఏఎంసీ మార్కెట్ యార్డులో పుంగనూరు నియోజకవర్గ స్థాయి మినీమహానాడు నియోజకవర్గ పరిశీలకులు దువ్వూరు భాస్కర్ ఆధ్వర్యంలో జరిగింది. కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడును విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు తీర్మాణాలు చేశారు. పుంగనూరు నియోజక వర్గంలోని 5 మండలాలను అన్నమయ్య జిల్లాలో చేర్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. పులిచెర్ల మండలాన్ని అన్నమయ్య జిల్లాలో కలపాలని, మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయాలని తీర్మానించారు. మామిడి, టమోటా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ప్రాజెక్టులు కట్టి నష్టపరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పడుతున్న రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని, నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై అక్రమంగా నమోదైన కేసులు రద్దు చేయాలని, మహానాడును విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కడపకు తరలి రావాలని సమావేశంలో తీర్మానాలు చేశారు. పలు తీర్మానాలను ప్రతిపాదనలు కడపలో జరిగే మహానాడులో పార్టీ అధిష్టానానికి నివేదించే విషయాలను మినీ మహానాడులో సమీక్షించారు. అనంతరం నియోజక వర్గంలోని పలువురు నాయకులు తమ అభిప్రాయాలను ఇన్‌చార్జి చల్లా బాబు దృష్టికి తెచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యంనాయుడు, ఉయ్యాల రమణ, మాధవరెడ్డి, శమీపతి యాదవ్, సుహేల్, కవిత, జనార్దన్, హరిప్రసాద్, శ్రీకాంత్, ప్రదీప్, శ్రీనివాసులు నాయుడు, రెడ్డిప్రసాద్‌రెడ్డి, అమరనాథ్ యా దవ్, శ్రీనివాసులురెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ముల్లంగి వెంకటరమణ, ఓబులేశ్వర్‌రెడ్డి, మురళీధర్‌నాయుడు, ఇబ్రహీం, ఇమ్రాన్, వేణుగోపాల్‌నాయుడు, మోహన్‌నాయుడు, ఉమాపతినాయుడు, శివశంకర్, మహేంద్రబాబు, శ్రీనివాసులు, అష్రఫ్ అలీ, రఫీ, బాలాజీనాయుడు, సతీశ్, సుబ్బరాయులు, సుబ్రహ్మణ్యం యాదవ్, రమేశ్‌నాయుడు, సుధాకర్, భానుప్రకాశ్‌నాయుడు పాల్గొన్నారు.

హోమియో వైద్యం అంతంతమాత్రం..!

ఎనిమిదేళ్లుగా ఖాళీగా వైద్యాధికారి, అటెండర్ల పోస్టులు ● ఇరుకు గదిలో కొనసాగుతున్న ఆస్పత్రి



ఇరుకు గదిలో కొనసాగుతున్న హోమియో ఆస్పత్రి

రామకుప్పం, మే 22 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రికి సొంత భవనం లేక ప్రభుత్వాస్పత్రిలోని ఇరుకు గదిలోనే కొనసాగుతోంది. ఆసుపత్రిలో వైద్యాధికారి, అటెండరు పోస్టులు కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. 1988లో రామకుప్పంలో హోమియోపతి ఆస్పత్రిని ప్రభుత్వం ప్రారంభించింది. అప్పట్లో పట్టణ శివారు ప్రాంతం బందార్లపల్లెలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆసుపత్రిని ప్రారంభించారు. 2017 వరకు ఆసుపత్రిలో వైద్యాధికారులు ఉండటంతో రోజూ వందకు పైగా రోగులు ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందేవారు. 2017 నుంచి ఆసుపత్రిలో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో కాంపౌండర్ రోగులకు వైద్యసేవలందిస్తున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. 2018 నుంచి అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. శాఖాపరమైన సమావేశాలు, ఇతర సందర్భాల్లో కాంపౌండర్ విధులు దూరంగా ఉంటే ఆస్పత్రి మూత పడాల్సిందే. ప్రారంభం నుంచి ఆస్పత్రికి సొంత భవనం లేదు. 2010 నుంచి రామకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ ఇరుకు గదిలో కొనసాగుతోంది. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి రామకుప్పం హోమియోపతి ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యాధికారి, అటెండరు పోస్టులను సత్వరం భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యాభివృద్ధితోనే మానవ వికాసం



హాస్టల్ భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధితోనే మానవ వికాసం సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా హాస్టల్ భవన నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేకించి కుప్పంలో విద్యా వైద్య సదుపాయాల మెరుగుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు కోట్లలో నిధులు వెచ్చిస్తున్నారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవసరమైన మహిళా హాస్టల్ భవనంతోపాటు ప్రహరీ నిర్మాణాలు, బోరుబావి తవ్వకం, డిజిటల్ లైబ్రరీ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, క్రీడా సామగ్రి వంటి అన్నిరకాల మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.5 కోట్లను విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కుప్పం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, గుడుపల్లె మండల పార్టీ అధ్యక్షుడు బాబునాయుడు, రాజు, వెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ చిందబరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశ్రమల కోసం భూ పరిశీలన



పరిశ్రమల స్థాపన కోసం భూపరిశీలన చేస్తున్న అధికారులు

వి.కోట, మే 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల కోసం గురువారం తహసీల్దారు ఉదయ్ సంతోష్ ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడితో కలిసి బోయచిన్నాగనపల్లె పంచాయతీ పరిధిలోని రామనాథపురంలో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ మాట్లాడుతూ నిరుద్యోగులకు స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అలాగే వి.కోట మేజర్ గ్రామ పంచాయతీకి డంపింగ్ యార్డు లేకుండా చెత్త చెరువులో పడేస్తున్నారని ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన రెవెన్యూ అధికారులు గెస్తింపల్లె రోడ్డులో 5 ఎకరాలు ప్రభుత్వ భూమిని గుర్తించారు. అక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపుతున్నట్లు స్పష్టం చేశారు.

రైతులకు అందుబాటులో వేరుశనగ విత్తనాలు

వి.కోట, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో వేరుశనగ సాగు చేసే రైతుల కోసం కే-6 రకం విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో అప్సోజీ తెలిపారు. వి.కోట మండలానికి సంబంధించి 1,346 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరం కాగా.. 216 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో అవసరం మేరకు విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఓగు, బైరుపల్లె, బోయచిన్నాగనపల్లె, తోటకనుమ, నెర్నపల్లె ఆర్ఎస్‌కేలో నిల్వ చేశామన్నారు. ఓగులో వచ్చిన విత్తనాల నాణ్యతను ఏవో సిబ్బందితో కలిసి పరిశీలించారు.

పరీక్షకు వెళ్లి తిరిగిరాలేదు

పుంగనూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు పుంగనూరు ఏఎస్ఐ యూసుఫ్ తెలిపారు. పలమనేరు పట్టణానికి చెందిన చంద్రప్ప కుమార్తె రేవతి (19) పుంగనూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ పరీక్షలు రాయడానికి బుధవారం ఇంటి నుంచి వచ్చినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. పరీక్షలు రాసి బయటకు వచ్చానని చెప్పిన రేవతి ఇంటికి వెళ్లకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కుప్పం గంగమాంబ హుండీ ఆదాయం రూ.40 లక్షలు



కుప్పం, మే 22 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న గంగమాంబ జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. అమ్మవారికి హుండీ ద్వారా ఈ ఉత్సవాలలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఈవో కమలాకర్, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. హుండీ ద్వారా రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఆభరణాల రూపంలో 95 గ్రాముల బంగారం, 626 గ్రాముల వెండి భక్తులు హుండీలో కానుకలుగా సమర్పించారని చెప్పారు. హుండీ లెక్కింపులో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



కల్లూరులో ఊరేగుతున్న హనుమంతుడు

రామకుప్పం, మే 22 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో గురువారం హనుమజ్జయంతి పూజలు ఘనంగా నిర్వహించారు. రామకుప్పం పట్టణ శివార్లలోని పిల్లిగుట్టలు, తిమ్మసముద్రంలలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో అభిషేక పూజలు నిర్వహించారు.

పలమనేరు: పలమనేరులో గురువారం హనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు. బజారు వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు చేపట్టారు.

చౌడేపల్లె: స్థానిక బస్టాండ్ సమీపంలోని కమలాంజనేయస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అఖండ దీపాన్ని వెలిగించారు. స్వామివారిని పుష్పపల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. రాజనాలబండ, కర్ణంవారపల్లె, 29 ఏ చింతమాకులపల్లె, గడ్డంవారిపల్లెల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పుంగనూరు: పుంగనూరు కోనేరు వద్ద వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయం, రాముల వారిగుడి, తోపుమఠం, రాజులూరు భగత్‌సింగ్ కాలనీ, మేలుపట్ల, అరవపల్లె, భీమగానిపల్లె క్రాస్, ఈడిగపల్లె తదితర ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి. స్థానిక తోపుమఠంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

రామకుప్పం: సింగసముద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం శ్రీరామకోటి నామస్మరణ ప్రారంభమైంది.

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలోని చిచ్చిలివారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లె, పెద్దగొట్టిగళ్లు, పెద్దమల్లెల నడింపల్లె పంచముఖ ఆంజనేయస్వామి, రొంపిచెర్ల కోదండరామాలయం, బొమ్మయ్యగారిపల్లె చెన్నకేశవస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

కల్లూరు: పులిచెర్ల మండలం చల్లావారిపల్లి, కుమ్మరపల్లి, దేవళంపేటలోని అభయ ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. చల్లావారిపల్లి ఆలయంలో ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన వాహనంపై ఊరేగించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే మురళీ మోహన్



తవణంపల్లె ఎంపీటీసీ బాబును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రాజన్, ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. గురువారం కాణిపాకంక్రాస్ వద్ద ఉన్న బాలాజి కల్యాణ మండపంలో పూతలపట్టు నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్ర పటానికి పూజలు చేశాక, ఎమ్మెల్యే ప్రసంగించారు. ప్రభుత్వం ఏర్పాటైన 11 నెలల కాలంలో నియోజకవర్గంలో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం వైసీపీకి రాజీనామా చేసిన తవణంపల్లె ఎంపీటీసీ గాండ్ల బాబును చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ ఆధ్వర్యంలో తెలుగుదేశంలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల అధ్యక్షులు గాలి దిలీప్, దొరబాబు చౌదరి, ధరణి, మురార్జి యాదవ్, మాజీ జడ్పీటీసీలు వెంకటేష్‌చౌదరి, కోదండయ్య, మాజీ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, మహిళా అధ్యక్షులు చిత్ర, చిట్టెమ్మ, నాయకులు జయప్రకాష్‌నాయుడు, అమరేంద్రనాయుడు, ధనంజయనాయుడు, మధు, గోపి యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించండి

● అదనపు డీఎంహెచ్‌వో



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటప్రసాద్

యాదమరి, మే 22 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ సూచించారు. గురువారం మాదిరెడ్డిపల్లె పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్యసేవలను గురించి వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన రోగులకు తప్పనిసరిగా లెప్రసీ, హెచ్‌ఐవీ, టీబీ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను తనిఖీ చేశారు. డాక్టర్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం టీడీపీ నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న చినబాబు

విజయపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): విజయపురం టీడీపీ నూతన కార్యవర్గాన్ని గురువారం నగరి టీడీపీ కార్యాలయంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి నల్లపనేని చినబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచనల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా గుణభూషణమ్మ, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మహేంద్ర, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా చెంచయ్య, యువత అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, మైనారిటీ అధ్యక్షుడిగా ఖాదర్ బాషా, టీఎస్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా దిలీప్‌కుమార్, టీఎస్‌టీయూసీ అధ్యక్షుడిగా మోహన్, ఐ టీడీపీ అధ్యక్షుడిగా సుధాకర్‌యాదవ్‌ను ఎంపిక చేశారు.

యోగా భవనాన్ని సందర్శించిన కలెక్టర్



యోగా భవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానం ఆవరణంలోని వాకర్స్ అసోసియేషన్ యోగా భవనాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం సందర్శించారు. యోగా భవన్‌ను, ధ్యాన మందిరాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భవనంలో మరికొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని నిధులు కేటాయిస్తే పూర్తి చేస్తామని కలెక్టర్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు వీకే విశ్వనాథ్ అభ్యర్థించారు. అలాగే గతంలో నిర్మాణానికి కేటాయించిన నిధుల్లో రూ.15 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ మొత్తాన్ని మంజూరు చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తన కార్యాలయంలో కలవాలని సభ్యులకు సూచించారు.


రేపు 'రేలా రే రేలా' జానపద నృత్య ప్రదర్శన



మీడియాతో మాట్లాడుతున్న దామోదర గణపతి

చిత్తూరు సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): 'రేలా రే రేలా' జానపద నృత్య ప్రదర్శన కట్టమంచిలోని ఎల్‌జీబీ శాంతా రఘురామన్ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జానపద గాయకుడు, కళారత్న దామోదర గణపతి గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు తెలిపారు. ప్రజలు తెలుగు భాషపై మక్కువ పెంచడానికి, సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవడానికి, దేశ భక్తిని ప్రేరేపించానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జానపద, దేశభక్తి గీతాలపై నృత్యాలు ఉంటాయన్నారు. 11 మంది విజయవాడ కళాకారులు పాల్గొంటారని వివరించారు. ఎమ్మెల్యే జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. కళాకారుడు, యాంకర్ నడింటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా క్వారీలు నిర్వహిస్తే కఠిన చర్యలు



కొత్తపల్లె వద్ద క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

బంగారుపాళ్యం, మే 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా క్వారీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. గురువారం పాలేరు రెవెన్యూ పరిధిలోని కొత్తపల్లె అటవీ ప్రాంతంలో, జంబువారిపల్లె సమీపంలో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా క్వారీలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పలమనేరు మైనింగ్ అధికారి అసిస్టెంట్ జియాలజిస్టు కుమారస్వామి, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, మైనింగ్ సర్వేయర్ అజితాబాయితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ ప్రదేశాలను పరిశీలించి క్వారీలకు వెళ్లే దారిలో పెద్ద ట్రెంచ్ ఏర్పాటు చేశారు. వీరితోపాటు వీఆర్వోలు రామకృష్ణ, గోవిందయ్య ఉన్నారు.

ఎన్టీఆర్ హౌసింగ్ పథకం అమలుకు త్వరలో శ్రీకారం



● ఇన్‌చార్జి డీఈ రాఘవయ్య

గంగాధరనెల్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హౌసింగ్ పథకం అమలుకు ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు నియోజకవర్గ హౌసింగ్ శాఖ ఇన్‌చార్జి డీఈ రాఘవయ్య తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. స్థల సౌకర్యం ఉండి ఈ పథకానికి అర్హులైనవారు రెవెన్యూశాఖ ద్వారా ఇంటిపట్టా పొజిషన్ సర్టిఫికెట్ పొందేందుకు ఆదేశాలు జారీచేశామన్నారు. స్థలం లేని వారి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 11,732 ఇళ్లకుగాను 7,706 మంది లబ్ధిదారులు నిర్మాణం పూర్తిచేశారన్నారు. పునాదుల స్థాయిలో 1,340, గోడల స్థాయిలో 708, మోల్డింగ్ స్థాయిలో 518 ఇళ్లు ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణ పనులు వేగవంతంకోసం ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50వేలు లెక్కన అదనపు సహాయం కింద ప్రభుత్వం తోడ్పాటు అందిస్తున్నదని తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.2.42లక్షల చొప్పున ఈ ఏడాది జూన్ నెలాఖరులోపు గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేలా ఆయా మండలాల హౌసింగ్, సచివాలయ ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక కార్యాచరణ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి రూ.లక్ష విరాళం



గౌరీదేవి ఆలయ నిర్వాహకులకు చెక్కును అందజేస్తున్న సినీ నటుడు మాన్యం కృష్ణ

బంగారుపాళ్యం, మే 22 (ఆంధ్రజ్యోతి): బొమ్మాయిపల్లెలోని గౌరీదేవిఆలయ ముఖద్వార నిర్మాణానికి హండ్రెడ్ డ్రీమ్స్ ఫౌండేషన్ తరపున రూ.లక్షను జంబువారిపల్లె పంచాయతీ మాధవనగర్‌కుచెందిన సినీనటుడు మాన్యం కృష్ణ విరాళమిచ్చారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును గురువారం తెల్లవారుజామున వజ్రాలపురం గంగజాతర ఊరేగింపులో నిర్వాహకులకు అందజేశారు.





2024 ఆగస్టు 20వ తేదీన కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యటించినప్పటి కొత్తకాలనీ వీధి దుస్థితి - ప్రస్తుతం సిమెంటు రోడ్డుతో కళకళ

బాగుపడుతున్న రోడ్లు

వెదురుకుప్పం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఔను ఇది మంచి ప్రభుత్వం. కనీస వసతులు సమకూరుతున్నాయి. గ్రామాల్లో వీధులకు సిమెంటు రోడ్డు సొబగు వస్తోంది. ఆనాడు వైసీపీ పాలనలో రాళ్ల రప్పలతో దర్శనమిచ్చిన వీధులు ఈ ప్రభుత్వంలో సిమెంటు రోడ్లతో కళకళలాడుతున్నాయి. అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కార్వేటినగరం మండలం కార్వేటి నగరం నుంచి పచ్చికాపల్లం వెళ్లే మార్గంలో కొత్తకాలనీ వైసీపీ ప్రభుత్వంలో ఏర్పడింది. కానీ, వీధులకు సిమెంటు రోడ్లు లేవు. రాళ్లు, రప్పలే దిక్కయ్యాయి. మంచి ప్రభుత్వం వచ్చాక సిమెంటు రోడ్లుగా మారుతున్నాయి.







కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై ఊరేగుతున్న వేణుగోపాలస్వామి - కల్యాణోత్సవంలో భాగంగా మంగళసూత్రాన్ని చూపుతున్న వేద పండితుడు

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై వేణుగోపాలుడి విహారం

వెదురుకుప్పం, మే 22 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం కల్పవృక్ష, రాత్రి సర్వభూపాల వాహనాలపై స్వామివారు విహరించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. తర్వాత కల్పవృక్ష వాహనంపై అధిష్ఠింపజేసి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయంలో స్వామివార్లకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో ఆర్జిత కల్యాణోత్సవం జరిగింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య సర్వభూపాల వాహనంపై కోలాటాలు, చెక్కభజనల మధ్య స్వామి ఊరేగారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబు సురేష్, కంకణభట్టర్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణ దాశరథి, రమేష్, శబరీష్, గోపాలస్వామి, ధన్వంతరి ప్రశాంత్, అలంకార పండితులు, టీటీడీ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి మహిళా డాక్టర్లు కావలెను

పూతలపట్టు, మే 22 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మహిళా డాక్టర్లు లేకపోవడంతో గర్భిణులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఇక్కడ ఇద్దరు మహిళా డాక్టర్లు ఉండటంతో రోజుకు 120 నుంచి 130 మంది వరకు రోగులు వచ్చేవారు. ముఖ్యంగా గర్భిణులకు మెరుగైన వైద్యపరీక్షలు చేసేవారు. వీరిలో డాక్టర్ ప్రియాంక గతనెల 21వ తేదీ నుంచి మెటర్నిటీ సెలవుపై వెళ్లారు. అలాగే డాక్టర్ ప్రవీణ డీఎంహెచ్‌వో జిల్లా ప్రోగ్రామ్ అధికారిగా బాధ్యతలు స్వీకరించడంతో ఆమె డిప్యుటేషన్‌పై జిల్లా కేంద్రానికి వెళ్లారు. ప్రస్తుతం ఇక్కడ వైద్యాధికారిగా వినయ్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. దానివల్ల మహిళా రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా వైద్యాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారి నియమాలు పాటిద్దాం



వాహన చోదకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ వాసుదేవరెడ్డి

నగరి, మే 22 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు రహదారి నియమాలు పాటించాలని ఎంవీఐ వాసుదేవరెడ్డి సూచించారు. గురువారం నగరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి పలు పనులపై వచ్చిన వాహన చోదకులతో రోడ్డు భద్రత నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించారు.

తాగునీటి బోరు చుట్టూ వ్యర్థాలు



విజయపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): పన్నూరు సబ్‌స్టేషన్, లక్కరాజు మిట్టకు మధ్యలో తాగునీటి బోరు చుట్టూ చెత్తాచెదారంతోపాటు కోళ్ల అవశేషాలు వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు వ్యర్థాలు బోరు నీటిలో కలుస్తూ రోగాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బోరు చుట్టూ వ్యర్థాలను తొలగించడంతోపాటు మరోసారి ఇలా చేయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైనికులకు అండగా నిలుద్దాం



ఐరాలలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

ఐరాల, మే 22 (ఆంధ్రజ్యోతి): భారత సైనికులకు మన మందరం అండగా నిలుద్దామని ఐరాల ప్రభుత్వ ఉన్న పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం గురువారం పిలుపునిచ్చింది. ఈ మేరకు పూర్వ విద్యార్థులంతా ఐరాల పురవీధుల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో మన సైనికులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పని చేస్తున్నారన్నారు. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు కె.సీతాపతినాయుడు, పూర్వ విద్యార్థులు ఏవీ రాజేష్‌రెడ్డి, సిద్ధయ్య, రమేష్‌బాబు, త్యాగరాజులనాయుడు, సూరిమాని సుబ్రహ్మణ్యం, హరినాథగుప్తా, సుకుమార్, ఖయ్యూబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న గోపాల్ రెడ్డి

పూతలపట్టు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు ఎం.గోపాల్ రెడ్డి అన్నారు. పి.కొత్తకోట సమీపాన ఉన్న శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక నిధులు అందించనున్నారన్నారు. రైతు నాయకుడు చెంగల్‌రెడ్డి, రైతులు రాజరత్నం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, బాబు కిరణ్, వెంకట నరసింహులు, జగన్నాథ రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.40 లక్షలు

కుప్పం, మే 22 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న గంగమ్మ జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. అమ్మవారికి హుండీ ద్వారా ఈ ఉత్సవాల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఈవో కమలాకర్, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. హుండీ ద్వారా రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఆభరణాల రూపంలో 95 గ్రాముల బంగారం, 626 గ్రాముల వెండి భక్తులు హుండీలో కానుకలుగా సమర్పించారని చెప్పారు. హుండీ లెక్కింపులో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

చిత్తూరు కల్చరల్, 22 మే (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆంజనేయుడి ఆలయాల్లో హనుమజ్జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని పొన్నియమ్మ గుడి వీధి వీరాంజనేయ స్వామిని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ దంపతులు దర్శించుకున్నారు. ఈవో వెంకటరాయలు, అర్చకుడు సుధాకర్ గురుకుల్, పాలక మండలి సభ్యుడు యతిరాజులు స్వాగతం పలికారు.

తవణంపల్లె: అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు జరిగాయి. భక్తులు ఇరుముడి చెల్లింపులు చేశారు. సాయంత్రం స్వామివారి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

పూతలపట్టు: మండలంలోని వడ్డార్లపల్లె సమీపాన ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు జరిగాయి. నరసింహులు నాయుడు కార్య నిర్వాహకులుగా వ్యవహరించారు.

శ్రీరంగరాజపురం: మండలంలోని సింధురాజపురంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో చైర్మన్ బాలాజీనాయుడు, బోడపాటి లోకనాధం నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, రమేష్ నాయుడు, మాధవ నాయుడు, దేవరాజులు నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగరి: మున్సిపాలిటీ పరిధిలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో సీతారామస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లను ఊరేగించారు.

వెదురుకుప్పం: దేవళంపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ● కార్వేటినగరంలోని హనుమాన్, కోదండరామస్వామి ఆలయంలో పూజలు జరిగాయి. ఆంజనేయుడి విగ్రహాన్ని తమలపాకులు, వడలతో అలంకరించి భక్తులకు దర్శనవసతి కల్పించారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని వేల్కూరు రోడ్ దళితవాడ వద్ద ఉన్న ఆంజనేయస్వామికి ఆలయ ధర్మకర్తలు, తిరుమల పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ చంద్రవేలు, చిత్తూరు గాంధీ రోడ్ విద్యుత్‌శాఖ సబ్‌ఇంజనీర్ చరణ్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అల్లి యెల్లమ్మ ఆలయం వద్ద నుంచి వేల్కూరు ఆలయం వరకు ఆంజనేయస్వామి, సీతారామలక్ష్మణ ఉత్సవర్లను ఊరేగించారు. టీడీపీ నేతలు వడివేలు, మునస్వామి, భార్గవ్ పాల్గొన్నారు. వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డిపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజలకు మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, నాయకులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని కృష్ణజిమ్మాపురం, ఆముదాల గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో వేడుకలు జరిగాయి.







చిత్తూరులో వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జగన్మోహన్ దంపతులు - కార్వేటినగరంలో ఆంజనేయస్వామికి తమలపాకులు, వడలతో అలంకరణ - అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయానికి ఇరుముడులతో వచ్చిన భక్తులు

సంక్షిప్తంగా..

నేడు నింద్ర టీడీపీ సమావేశం

నింద్ర, మే 22 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండల టీడీపీ సర్వసభ్య సమావేశం నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం జరగనుంది. నింద్రలోని సాయిబాబా ఆలయంలో వద్ద జరిగే సమావేశానికి చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు వస్తారని మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని సూచించారు.

దాడిపై ఇరువర్గాల ఫిర్యాదు

వెదురుకుప్పం, మే 22 (ఆంధ్రజ్యోతి): తిప్పినాయుడుపల్లె కాలనీలో గురువారం రెండు వర్గాల మధ్య దాడి జరిగింది. తర్వాత ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. తిప్పినాయుడుపల్లె కాలనీకి చెందిన నరేష్ ఉపాధి పథకంలో ఫీల్డ్ అసిస్టెంటుగా పని చేస్తున్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని వెదురుకుప్పం ఉపాధి హామీ పథకం కార్యాలయంలో అదే గ్రామానికి చెందిన గుణశేఖర్ ఫిర్యాదు చేయడంతో వివాదం మొదలైంది. రెండువర్గాలుగా ఏర్పడి దాడిచేసుకుని, పంచాయితీ పోలీసుల వద్దకెళ్లింది. రాత్రి వరకు కేసు నమోదు కాలేదు. పోలీసులు విచారిస్తున్నారని సమాచారం.

'ఎండీయూ వ్యవస్థ రద్దు సరికాదు'

చిత్తూరు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా రేషన్ సరుకులు ఇంటింటికీ అందించే ఎండీయూ వాహన రద్దు నిర్ణయం సరికాదు.. ఉపసంహరించుకోవాలని ఆపరేటర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఎండీయూ ఆపరేటర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు వేణు ఆధ్వర్యంలో పలు మండలాల ఆపరేటర్లు కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరిని కలిసి వినతిపత్రం అందజేశారు.

రోడ్డును బాగు చేయండి

బంగారుపాళ్యం, మే 22 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం నుంచి పొదలమడుగు వెళ్లే రాగిమానుపెంట రోడ్డు గుంతలతో నిండిపోయింది. దీన్ని బాగు చేయాలంటూ బంగారుపాళ్యం సచివాలయం-2 సమీపంలో టీడీపీ నాయకుతో కలిసి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నాగరాజనాయుడు గురువారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణమ నాయుడు, రమేష్, జయరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాలయంలో కుంభాభిషేకం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుడిపాల, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగంపల్లె పంచాయతీ కొండాపురంలోని శ్రీకృష్ణాలయంలో మహాకుంభాభిషేకాన్ని అర్చకులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమం, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామ పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర



పురవీధుల్లో విహరిస్తున్న గంగమ్మ

నింద్ర, మే 22 (ఆంధ్రజ్యోతి): నెట్టేరి, అరూరు, ఎలకాటూరుల్లో గంగజాతరను వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి అమ్మవారిని పురవీధులలో ఊరేగించి నడివీధిలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గురువారం సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని గ్రామ పొలిమేరల్లో నిమజ్జనం చేశారు.